క్లుప్తంగా

మంత్రి తుమ్మలకు గిఫ్ట్..

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం నగర 10వ డివిజన్ కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు దంపతులు పుంగనూరు ఆవుదూడను బహుమతిగా అందించారు. బుధవారం కార్పొరేటర్ దంపతులు స్వయంగా ఆ దూడను తీసుకెళ్లి, దమ్మపేట మండలంలోని మంత్రి స్వగ్రామం గండుగలపల్లిలో అందజేశారు.

నేడు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు మంత్రి కార్యంపు కార్యాల యం నుంచి ప్రకటన విడుదలైంది. ఉదయం 11 గంటలకు సత్తుపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. నీలగిరి అర్బన్ పార్కులో చైన్ లింక్ ఫెన్సింగ్ పనులు, బ్యాటరీ వాహనం, ఫారెస్ట్ మీటింగ్ హాల్, పోడియం, వన విభాగం డిపోలో ఏర్పాటు చేసిన సదుపాయాలను ప్రారంభిస్తారు.

ఇద్దరు ఏఈఓలకు డిప్యూటేషన్

కామేపల్లి: యూరియా కూపన్లు అడిగిన రైతులపై దురుసుగా మాట్లాడిన ఇద్దరు ఏఈఓలను డిప్యూటేషన్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11న కామేపల్లి రైతువేదికలో జాస్తిపల్లి గ్రామానికి చెందిన రైతులపై కామేపల్లి, మద్దులపల్లి ఏఈఓలు దురుసుగా ప్రవర్తించినట్లు కథనాలు రావడంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను ఆదేశించారు. ఈమేరకు మద్దులపల్లి ఏఈఓ రవికుమార్‌ను ముదిగొండ మండలం ముత్తారం, కామేపల్లి ఏఈఓ శ్రీకన్యను నేలకొండపల్లి మండలం నాచేపల్లి క్లస్టర్‌కు డిప్యూటేషన్ చేశారు.

జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సెడార్ వాలీ స్కూల్‌లో జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల నెట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. 40 మంది బాలురు 35 మంది బాలికలు పాల్గొన్నారు. ప్రక్రియను జిల్లా నెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షులు సీహెచ్ దీప్తి, కార్యదర్శి ఫణి కుమార్ పర్యవేక్షించారు. ఎంపిక పోటీలను స్కూల్ కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి ప్రారంభించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలబాలికల జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

స్వచ్ఛతా హి సేవా ర్యాలీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో స్వచ్ఛతా హి సేవా- 2025 కార్యక్రమంలో భాగంగా కేఎంసీ ఆధ్వర్యాన బుధవారం లకారం ట్యాంక్ బండ్ నుంచి ఇందిరానగర్ వరకు స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. అనంతరం లకారం ట్యాంక్ బండ్ వద్ద స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రోబయాలజీ దినోత్సవం

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మైక్రోబయాలజీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మైక్రో ఆర్గానిజం పనితీరు, మెడిసిన్ తయారీ, వ్యాధుల నియంత్రణలో మైక్రోబయాలజీ ప్రాధాన్యతను అధ్యాపకులు వివరించారు. గూగుల్ క్విజ్ నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ వేంసాని వెంకటేశ్వర్లరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సేవలకు అంతరాయం

ఖమ్మంక్రైం: హైదరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయం సర్వర్లలో లోపాల కారణంగా బుధవారం నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో పలుమార్లు సేవలకు అంతరాయం ఏర్పడింది. ఇంకా రెండు, మూడు రోజుల పాటు సేవల కోసం వచ్చే వాహనదారులకు ఇబ్బందులు ఉంటాయని అధికారులు చెప్పారు.

పేదలకు అండగా ప్రభుత్వం

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో బుధవారం పర్యటనలో భాగంగా జరిగిన సభలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని మోటాపురం, రాజేశ్వరపురం, కొత్తకొత్తూరు, బైరవునిపల్లి గ్రామాల్లో అంతర్గత రహదారులకు శంకుస్థాపన చేసి నేలకొండపల్లిలోని సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, వల్లాల రాధాకృష్ణ, రావెళ్ల కృష్ణారావు, జెర్రిపోతుల అంజిని, కుక్కల హనుమంతరావు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని రాజేశ్వరపురం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి, అదనపు గదుల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

➡ అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంఅర్బన్: నగర పరిధిలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కేఎంసీ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. మున్సిపల్ సాధారణ నిధులతో 15 సీసీ రోడ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి అన్ని రోడ్ల పనులు పూర్తి చేసి డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి



నేలకొండపల్లి: కొత్తకొత్తూరు సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

రమేష్, నగరపాలక సంస్థ డీఈ ధరణికుమార్, ఏఈ నరేంద్ర తేజ, కార్పొరేటర్ హుస్సేన్, ఉపేందర్ ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

➡ వినతి అందజేత..



వినతి ఇస్తున్న కాలనీవాసులు

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని విద్యానగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాలనీవాసులు బుధవారం వినతిపత్రం అందజేశారు. నగరంలోని 1వ డివిజన్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన మంత్రి దృష్టికి కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరగా.. వచ్చే వర్షాకాలం కల్లా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కూడా వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి నరసింహారావు, బానోత్ బాలునాయక్, జూలాది లెనిన్, గోదా వెంకట నాగమల్లేశ్వరరావు, మంగీలాల్, రేగులగడ్డ ప్రభావతి, బండి నాగేంద్ర, మోతె శోభ, గుర్రం సుజాత, తూము రాంబాబు, రబ్బానీ, జగదీష్, రామారావు, వెంకటేశ్వర రెడ్డి, పద్మ, శ్రీనివాస్, కృష్ణ, మహేష్, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న చేతన ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని మంత్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాలలకు డిజిటల్ టీవీలు అందజేసిన సందర్భంగా మంత్రి మాట్లాడి ఫౌండేషన్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి, చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు జర్నలిస్టుల వినతి

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఆధ్వర్యాన బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు మాట్లాడుతూ.. స్టాఫ్ రిపోర్టర్ సాంబశివరావు, మరో ఇద్దరు రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎలక్ట్రాన్ మీడియా జిల్లా అధ్యక్షుడు మామిడాల భూపాల్‌రావు, ఆయా సంఘాల నాయకులు వనం వెంకటేశ్వర్లు, హరీష్ రాజు, మందుల ఉపేందర్, గుద్దేటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



భట్టికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

సంక్షిప్తంగా..

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కామేపల్లి: మావోయిస్టులపై జరుగుతున్న మారణకాండను తక్షణమే ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి భూక్యా శివ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం తాళ్లగూడెంలో సీపీఐ(ఎంఐ) న్యూడెమోక్రసీలో సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ విలీన సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 24న మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో జరిగే విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జర్పుల రామ్‌సింగ్, సుంకరి బుచ్చయ్య, దంతాల నారాయణ, అజ్మీరా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న చలో భద్రాచలం బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) చైర్మన్ చుంచ రామకృష్ణ కోరారు. బుధవారం ఖమ్మంలో దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1976లో కాంగ్రెస్ స్వలాభం కోసం లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసీలను అన్యాయానికి గురిచేసిందని, ఇప్పుడు అదే కొనసాగితే ఉరుకోలేమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ అడ్వైజర్ కమిటీ నాయకులు మేట్ల పాపయ్యదొర, కల్తీ వీరమల్లు, కొముర ప్రసాద్‌రావు, ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు ముర్ల రమేష్‌రెడ్డి, జగ్గ పుల్లయ్య, దబ్బకట్ల సుమన్, ముర్రం వీరభద్రం, కుంజ శ్రీను, కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, కల్తీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జనపనార సంచుల ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌లు జనపనార సంచులను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు గత ఐదేళ్లుగా శ్రీ హన్విక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కమర్తపు మురళి, తుంపాల కృష్ణమోహన్, శ్రీనివాస్, దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ జయంతి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, విశ్వబ్రాహ్మణ కుల సంఘ నాయకులు పాల్గొని విరాట్ విశ్వకర్మ విశిష్టతను తెలియజేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి, విశ్వబ్రాహ్మణ కుల సంఘ నాయకులు అద్దంకి నాగేశ్వరరావు, సదానందచారి, శ్రీనివాసరావు, వసంతరావు, నరసింహాచారి స్వామి, సత్యనారాయణ, రాజేశ్వరరావు, గోవిందమ్మ, కృష్ణమాచారి, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలి మృతి

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకురాలు, ఐద్వా ప్రతినిధి గోళ్ల రాజమ్మ (68) బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులతో పాటు రమేష్, కే.వీ. రెడ్డి, ఉమామహేశ్వరీ, తదితరులు సందర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న నెల్లూరి కోటేశ్వరరావు

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బీజేపీ ఆధ్వర్యాన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి అన్న ప్రసాదం వితరణ చేశారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ రక్తదానం శిబిరం నిర్వహించగా పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్‌తో పాటు విద్యాసాగర్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, పాపారావు, వెంకటేశ్వర్లు, కృష్ణారావు, దుర్గారావు, చక్రపాణి, అనిత, సరస్వతి, షర్ఫుద్దీన్, గోవిందరావు, జ్ఞానరత్నం, రామకృష్ణ, మోహినుద్దీన్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులతో ఇళ్ల నిర్మాణం



ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలకు మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలతో ఇళ్లు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం నగరంలోని 26వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అర్హులైన కుటుంబాలకు గృహస్థలం కల్పించడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ ఫాతిమా జోహార, కార్పొరేషన్ వార్డ్ ఆఫీసర్ రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: నగరంలోని న్యాయసేవాధికార సంస్థ హాల్‌లో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడుతూ.. నగరంలో 250 మంది పిల్లలు తలసేమియాతో బాధపడుతున్నారని, వీరికి ప్రతినెలా 2 లేదా మూడు సార్లు రక్తం ఎక్కించాల్సి వస్తుందన్నారు. ఈనేపథ్యాన సంకల్ప స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన తలసేమియా పిల్లలకు రక్తం ఎక్కిస్తున్నారని, 2010 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. ఈ శిబిరంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు మొత్తం 21మంది రక్తదానం చేశారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

నేలకొండపల్లి: గురుకులంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వంట గదులు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకుని, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పరిశుభ్ర వాతావరణంలో భోజనం అందించి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎంఈఓ బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి

కామేపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం పెట్టాలని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. బుధవారం పాతలింగాలలోని కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

దడవాయిల వినతి

ఖమ్మంవ్యవసాయం: దడవాయిల సంఘ కార్యాలయం మరమ్మతులు, వైద్య బిల్లులు వంటి సమస్యలు పరిష్కరించాలని పలువురు దడవాయిలు బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అదించారు. ఈ కార్యక్రమంలో దడవాయి సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.కుమార్, పూర్వపు ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో సంబరాలు

రఘునాథపాలెం: తెలంగాణ మైనారిటీ విద్యాసంస్థల కాల నిర్ణయ పట్టికలో మార్పు చేసిన నేపథ్యాన పీఆర్టీయూ రఘునాథపాలెం మండల శాఖ ఆధ్వర్యాన బుధవారం రఘునాథపాలెం మైనార్టీ గురుకుల పాఠశాలలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషిచేసిన టీఎస్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డిని అభినందించారు. జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ సోమ్లానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌హెచ్ రంగారావు, ప్రిన్సిపాల్ ఎం.శైలజలతో పాటు శ్రీనివాసరావు, గుర్రం కేశవరావు, సైదుబాబు, డి.వినోద్, ఎం.నాగమల్లేశ్వరరావు, చారి, జబ్బార్, ముకుందరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

☛ స్టేట్ ప్రాజెక్టు ఆఫీస్ ముట్టడిని..

కూసుమంచి: కేజీబీవీ, యూఆర్ఎస్, నాన్‌టీచింగ్ వర్కర్ల వేతనాలు, ఖాళీ పోస్టుల భర్తీ, పని భారం తగ్గింపు తదితర సమస్యలపై ఈనెల 22న హైదరాబాద్‌లో జరిగే స్టేట్ ప్రాజెక్టు ఆఫీస్ ముట్టడిని విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. బుధవారం కూసుమంచిలోని కస్తూర్బా పాఠశాలలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

☛ ఆమరణ నిరాహార దీక్షను..

కూసుమంచి: బీసీల రిజర్వేషన్ అమలు కోరుతూ ఈనెల 26న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాసరావు చేపట్టే ఆమరణ నిరాహార దీక్షను జయప్రదం చేయాలని పాలేరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం రామకృష్ణ కోరారు.

సాయుధ పోరాటం దేశానికే ఆదర్శం

భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశానికే ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగువవేసి అమరవీరులకు జోహార్లు అర్పించారు. నిరసన ర్యాలీలు చేపట్టారు. తెలంగాణ సాయుధ పోరాదంతో సంబంధం లేని మతోన్మాద శక్తులు చేసే విష ప్రచారాన్ని యువత, తెలంగాణ సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కార్యాలయంలో జాతీయజెండాకు వందనం చేస్తున్న మేయర్ నీరజ



ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ..



ఖమ్మంవైరారోడ్: జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్



తిరుమలాయపాలెం: సుబ్లేడులో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



కూసుమంచి: పాలేరులో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాస్‌లైన్ నాయకులు



కామేపల్లి: పోలీస్ స్టేషన్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎస్‌ఐ సాయికుమార్



ఖమ్మంవ్యవసాయం:జిల్లా సహకార కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న డీసీఓ గంగాధర్



ఖమ్మం మామిళ్లగూడెం: జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు



ఖమ్మంక్రైం: రవాణా శాఖ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ వెంకటరమణ



ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో..



రఘునాథపాలెం: ఎంపీడీఓ కార్యాలయంలో..



నేలకొండపల్లి: సుర్దేపల్లి పాఠశాలలో జెండాకు వందనం చేస్తున్న హెచ్ఎం లక్ష్మణ్

మూగబోతున్నాయి..

పశువులకు అందని వైద్యం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- నత్తనడకన పశువుల టీకా వైద్యం
- పాలేరులో 1.10 లక్షల జీవాలకు తప్పని తిప్పలు



గొర్రెకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

ఖమ్మంరూరల్: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత వేధిస్తుండడంతో పశువైద్యం అందకుండా పోతోంది. పాడి పశువులతో పాటు వ్యవసాయం చేసే దుక్కిటెద్దులు, మేకలు, గొర్రెలకు వైద్యం అందిస్తుండగా.. ప్రస్తుతం ఉన్న పశువులకు అనుగుణంగా వైద్య సిబ్బంది లేకపోవడంతో వాటిని సరైన సమయానికి సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. అయితే ఒక్కో పాడి గేదె, దుక్కిటెద్దు కొనాలంటే కనీసం రూ.50వేలు వరకు పలుకుతుండగా.. వ్యాధులు ప్రబలి మృత్యువాత పడుతుండడంతో రైతులు, పాడి పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రబలుతున్న వ్యాధులు..

ప్రధానంగా వర్షాకాలంలో గొర్రెలకు గురకవ్యాధి, పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంటాయి. ఈ సమయాన ముందస్తు నివారణకు టీకా వేయాల్సి ఉండగా.. తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో పశువుల ప్రాణాల మీదకు వస్తోంది. జిల్లాలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వ్యాధుల నిర్మూలనకు పశువైద్య ఉన్నతాధికారులు, సిబ్బంది పశువులకు టీకా వేయడం ప్రారంభించినప్పటికీ మార్చి వరకు బాగానే కొనసాగి అర్ధాంతరంగా ఆపేశారు. దీంతో వ్యాధి మరింత ముదిరి పశువులకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1.10లక్షల పశువులుండగా అందులో ఇప్పటి వరకు 66 వేల పశువులకు టీకా వేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్‌యాప్ పథకం కింద చేపట్టిన జియోట్యాగింగ్ ప్రక్రియ కూడా సిబ్బంది కొరతతో నత్తనడకన సాగుతోంది. అయితే అనుకున్న లక్ష్యం చేరడానికి చాలీచాలని సిబ్బందే కారణమని ఉన్నతాధికారులు అంటున్నారు.

ఐదారు గ్రామాలకు ఒక సబ్ సెంటర్

ఇదిలా ఉండగా పశువైద్యశాఖలో సరైన డాక్టర్లు, సహాయకులు లేకపోవడంతో పశువులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలల్లో డాక్టర్లకు అదనపు విధుల సమయాన సహాయకులే వైద్యం చేయడం గమనార్హం. అయిదారు గ్రామాలకు కలిపి ఒక సబ్‌సెంటర్ ఉండడంతో మిగతా గ్రామాలకు చెందిన పశువులను దాదాపు ఏడెనిమిది కిలోమీటర్లు దూరం నడిపించి తీసుకెళ్లాల్సిన దుస్థితి ఉంది. ఉదాహరణకు ఖమ్మంరూరల్ మండలం చింతపల్లికి చెందిన రైతులు తమ పశువులకు ఏదైనా జబ్బు చేస్తే తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికి సుమారు ఆరు కిలోమీటర్లు నడిపించుకొని తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆయా గ్రామాల్లో గోపాల మిత్రలు ఉన్నప్పటికీ వారికి వైద్యం చేయించినందుకు ఎంతో కొంత ఇచ్చుకోవాల్సి రావడంతో రైతులు సరైన వైద్యం చేయించలేకపోతున్నాయి. నియోజకవర్గ కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో సరిపోను సిబ్బంది లేకపోవడంతో వైద్యులు కూడా చేసేదేమీ లేక ఉన్న సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా సరిపడా సిబ్బందిని నియమించి పశువులకు వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.